సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 14 । మార్చి । 2025



గూడేల్లో 'పులారా' ఉత్సవం

ఆదివాసీ గూడేల్లో గురువారం సంప్రదాయబద్ధంగా పులారా ఉత్సవం జరుపుకొన్నారు. ప్రతీ ఇంటి నుంచి కుడుకలు తీసుకువచ్చి గ్రామ పటేల్‌కు ఇచ్చారు.

8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర : 6:21	శని : 5:09

గరిష్టం/కనిష్టం 39.4 /23.6

వాతావరణం

ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. చలి ప్రభావం చాలా వరకు తగ్గుతుంది. తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో నెలరోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ కల్పిస్తారని వివరించారు. డిగ్రీ పూర్తయి 26 ఏళ్లలోపు వయస్సు ఉన్న బీసీ అభ్యర్థులు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 8లోగా https://studycircle.cgg.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలలోపు ఉండాలని, స్క్రీనింగ్ టెస్టులో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నం.08732-221280లో సంప్రదించాలని సూచించారు.

'అపార్' నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల అపార్ గుర్తింపు కా ర్డుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అపార్ గుర్తింపు సంఖ్య అందించాలన్నారు. వేసవిలో పాఠశాలల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ కింద అమలు చేస్తున్న కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీటీడీవో రమాదేవి, ఎస్‌వోలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకు 47 మంది జూనియర్ లెక్చరర్లు



నియామక పత్రం ఇస్తున్న డీఐఈవో కళ్యాణి

ఆసిఫాబాద్‌రూరల్: టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన వారు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 47 మంది జూనియర్ లెక్చరర్లను కేటాయించిందని డీఐఈవో కళ్యాణి తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం పలువురు విధుల్లో చేరారు. కాగా, జిల్లాలో పదేళ్లుగా 61 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. నూతన అధ్యాపకులు చేరడంతో ఉపాధి కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు విద్యా వ్యవస్థలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

సమస్య ఉంటే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఈ శేషారావు

దహెగాం(సిర్పూర్): విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని ట్రాన్స్‌కో ఏఈ శేషారావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు మోటార్లకు స్టార్టర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పంటల సాగుకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీఈ నాగరాజు, ఏఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి వేడి.. ఒంటిపూట బడి

- ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు
- ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు అమలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 'పది' పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి స్కూళ్లు



మోడి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు

పాఠశాలల పనివేళలు ఇలా..

మొదటి గంట	ఉదయం 8 గంటలు
రెండో గంట	ఉదయం 8:05 గంటలు
ప్రార్థన	ఉ.8:05 నుంచి 8:15
మొదటి పీరియడ్	8:15 నుంచి 8:55
రెండో పీరియడ్	8:55 నుంచి 9:35
మూడో పీరియడ్	9:35 నుంచి 10:15
స్వల్ప విరామం	10:15 నుంచి 10:30
నాలుగో పీరియడ్	10:30 నుంచి 11:10
ఐదో పీరియడ్	11:10 నుంచి 11:50
ఆరో పీరియడ్	11:50 గంటల నుంచి మధ్యాహ్నం 12:30

కెరమెరి(ఆసిఫాబాద్): మార్చిలోనే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఈ నెల 15 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనున్నాయి. ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించనున్నారు.

జిల్లాలో 1,273 పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఆశ్రమ, ఆదర్శ, గురుకులాలు, కేజీబీవీలు మొత్తం 1,273 పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆయా స్కూళ్లలో 98వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఫ్యాన్లు లేవు. నల్లాలు ఏర్పాటు చేసినా భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వలేదు. ఎండల తీవ్రత పెరగడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. డీహైడ్రేషన్, వడదెబ్బ, నీరసంతో అనారోగ్యం బారిన పడతారు. ఎండ, వేడి కారణంగా అలసటకు గురవుతారు. ఈ నేపథ్యంలో ఏటా ప్రభుత్వం వేసవిలో ఒంటిపూట బడులు నిర్వహిస్తుంది.

21 నుంచి 'పది' వార్షిక పరీక్షలు

ఈ నెల 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 174 ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఎగ్జామ్ సెంటర్లు ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాలల్లో మాత్రం తరగతులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఏప్రిల్ 24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించనున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎండల నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ఉపాధ్యాయులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి.

– యాదయ్య, జిల్లా విద్యాధికారి

మార్చిలోనే 40 డిగ్రీల ఎండ

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- గతేడాదితో పోల్చితే అధికం



జిల్లా కేంద్రంలోని జ్యూస్ సెంటర్ వద్ద ప్రజలు

తిర్యాణి(ఆసిఫాబాద్): వేసవి ప్రారంభంలోనే సూర్యుడు సుర్రుమంటున్నాడు. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేడి, ఉక్కపోత కారణంగా ప్రజలు మధ్యాహ్నం బయటికి రాలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. మార్చిలోనే పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావడం ఎండల తీవ్రతకు అద్దం పడుతోంది.

40 డిగ్రీలు దాటిన గరిష్ట ఉష్ణోగ్రతలు

జిల్లాలోని రెబ్బెనలో బుధవారం అత్యధికంగా 40.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది రాష్ట్రంలోనే రెండో గరిష్ట ఉష్ణోగ్రత.. గతేడాది మార్చి 12న రెబ్బెనలో 38.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఈ ఏడాది గరిష్ట ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీలు అధికంగా నమోదు కావడం విశేషం. జిల్లాలో గడిచిన మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల నుంచి 40 డిగ్రీల మధ్య రికార్డవుతున్నాయి. తాజాగా బుధవారం రెబ్బెనలో 40.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, కౌటాల, బెజ్జూర్‌లో 40.5, కెరమెరి, దహెగాం, తిర్యాణి మండలాల్లో 40.4, ఆసిఫాబాద్‌లో 40.3, పెంచికల్‌పేట్‌లో 40.2, సిర్పూర్(టి)లో 40.1, చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లో 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని 15 మండలాలకు పది మండలాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటింది. రానున్న మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత పెరగడంతో పాటు వడగాలులు అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని సూచిస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది.

నిర్మానుష్యంగా రోడ్లు

జిల్లాలో మూడు రోజులుగా ఎండలు పెరగడంతో పగటిపూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో రోజంతా కూలర్లకే అతుక్కుపోతున్నారు. ఎండల నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఇప్పటికే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి అప్రమత్తం చేశారు. ఉపాధిహామీ కూలీలు ఉదయం 9 గంటలకే పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. జ్యూస్ సెంటర్లు, కొబ్బరిబొండాలు, కీరదోసకాయల దుకాణాలకు జనాల తాకిడి పెరిగింది.

వసతుల కల్పనకు చర్యలు



కౌటగూడలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. మండలంలోని కౌటగూడ, జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంజూరైన మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అందించే పోషకాహారం గర్భిణులు, పిల్లలకు సక్రమంగా అందించాలన్నారు. వేసవిలో ఇబ్బందులు లేకుండా నిత్యం సూపర్‌వైజర్లు సెంటర్లను సందర్శించాలని సూచించారు. కాలం చెల్లిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించొద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా పోషణ్ అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, సూపర్‌వైజర్లు లైలా, పెంటుబాయి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌కు వివిధ పనులకు వచ్చే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్‌ను పరిశీలించారు. ఎండల నేపథ్యంలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు చల్లని తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏవో మధుకర్‌ను ఆదేశించారు. ఫ్రిడ్జ్‌లో లోపాలుంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం టీజీఎస్ ఆర్టీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలోని ప్రయాణికులు 99592 26006 నంబర్ కాల్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. ప్రయాణికులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గుడ్డు ధరలు పెంపు

- 'మధ్యాహ్న' ఏజెన్సీ మహిళలకు ఊరట
- సర్కారు పాఠశాల విద్యార్థులకు ప్రయోజనం
- రూ.5నుంచి రూ.6కు పెంచుతూ ఉత్తర్వులు జారీ



మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న కోడిగుడ్డు ధరలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారంలో మూడు రోజులు గుడ్డు అందిస్తోంది. ఇటీవల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ధరాభారం తాము మోయలేమంటూ మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కొన్ని పాఠశాలల్లో వారంలో గుడ్డుకు బదులు అరటిపండు ఇస్తుండగా.. ఇంకొందరు వారంలో ఒక గుడ్డుతో సరిపెడుతున్నారు. కోడిగుడ్డు కొనుగోలు అంటేనే వంట ఏజెన్సీ మహిళలు తమవైపు గుర్రుగా చూస్తున్నారని టీచర్లు వాపోయిన సందర్భాలు లేకపోలేదు. మార్కెట్‌లో గుడ్డు ధరలకు ప్రభుత్వం చెల్లించే ధరల్లో వ్యత్యాసం ఉండడంతో ఏజెన్సీలకు అదనపు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గుడ్డు ధరను ఒక రూపాయి పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. కోడిగుడ్డు ధర రూ.5నుంచి రూ.6 వరకు పెంచింది. దీంతో ఏజెన్సీ మహిళలకు ఉపశమనం కలుగనుంది.

ఆకాశాన్నంటిన ధర

కోడిగుడ్డు ధర బహిరంగ మార్కెట్‌లో ఆకాశాన్ని అంటుతోంది. మధ్యాహ్న భోజన తయారీ ఏజెన్సీలకు భారంగా మారుతోంది. మంచిర్యాల జిల్లాలోని 747 పాఠశాలల్లో 37,241మంది విద్యార్థులు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని 732 ప్రభుత్వ పాఠశాలల్లో 43,110 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తాయి. తొమ్మిది, పది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు వండి పెట్టేందుకు రూ.6.19, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు రూ.9.29 స్లాబ్ ధరలతోపాటు కోడిగుడ్డుకు అదనంగా రూ.5 రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. 9, 10వ తరగతుల వరకు రూ.10.68 పైసలు బిల్లులో కోడిగుడ్డు ధర కలిపి ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తోంది. కూరల కోసం పప్పు, కూరగాయలు, నూనెను వంట ఏజెన్సీ మహిళలు సమకూర్చుకుంటారు. విద్యార్థులందరికీ సోమ, బుధ, శుక్రవారాల్లో మధ్యాహ్న భోజనంలో ఉడికించిన కోడిగుడ్డు అందించాలి. గతంలో గుడ్డుకు రూ.4 చెల్లించే ప్రభుత్వం 2022లో అప్పటి ధరల ప్రకారం రూ.5కు పెంచింది. కానీ కొద్ది నెలలుగా గుడ్డు ధర అమాంతం పెరగడంతో చాలా పాఠశాలల్లో వారానికి ఒకటి, రెండుసార్లు మాత్రమే వడ్డిస్తున్నారు. దీంతో విద్యార్థులు పోషకాహారానికి దూరం అవుతున్నారు. ఒక్కో గుడ్డుకు రూ.5 ప్రభుత్వం చెల్లిస్తుండగా.. ప్రస్తుత మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7వరకు పలుకుతున్న సందర్భాలు ఉన్నాయి. రానున్న రోజుల్లో ఇంకెంత పెరుగుతుందోనని ఏజెన్సీ నిర్వాహకులు ధరలు పెంచాలని ఆందోళన చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజనం వంట ధరలను పెంచుతూ కేంద్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పెంచిన ధరలు డిసెంబర్ ఒకటి నుంచి అమల్లోకి తెచ్చారు. కేంద్రం ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. రెండేళ్ల తర్వాత మధ్యాహ్నం భోజనం వంట ధరల పెంపుతో ఏజెన్సీలకు కాస్త ఊరట కలిగిస్తోంది.

మూడు రోజులు అందించాలి

కోడిగుడ్డు ధరలు పెంచుతూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్‌లో గుడ్డు ధరలు పెరగడం వల్ల ఏజెన్సీల నిర్వాహకులు కొంత ఇబ్బంది పడిన విషయం తెలియంది కాదు. రూపాయి పెంచడం వల్ల ఏజెన్సీలు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. పోషకాలు అందించేందుకు విద్యార్థులకు విధిగా వారానికి మూడు రోజులు ఉడకబెట్టిన గుడ్డు అందించాల్సిందే.

– యాదయ్య, డీఈవో

నెలరోజులుగా 'భగీరథ' బంద్

- అందవెల్లి వంతెన అప్రోచ్ రోడ్డు పనులతో పైప్‌లైన్ తొలగింపు
- పనులు పూర్తయినా నీటి సరఫరా పునరుద్ధరించని అధికారులు
- నాలుగు మండలాల్లోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు



అందవెల్లి వంతెన వద్ద తొలగించిన భగీరథ పైపులైన్(ఫైల్)

దహెగాం(సిర్పూర్): మిషన్ భగీరథ నీటి సరఫరా నెల రోజులుగా నిలిచిపోయింది. ఓ వైపు ఎండలు మండుతుండగా.. నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగుపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు పనులు ఫిబ్రవరి 12న ప్రారంభించారు. వంతెన పైనుంచి భగీరథ పైప్‌లైన్ ఉండటంతో అప్రోచ్ పనుల సమయంలో ఆ పైప్‌లైన్ తొలగించారు. అప్పటి నుంచి భగీరథ నీటి సరఫరా కావడం లేదు. నెల రోజులైనా పునరుద్ధరించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి తంటాలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా..

నెల రోజులుగా భగీరథ పథకం నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో విద్యుత్ బోర్ల వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. దహెగాం మండలం ఒడ్డుగూడ, బామానగర్, ఐనం గ్రామాల్లో తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్నందున పంచాయతీల ఆధ్వర్యంలో ట్యాంకర్లను ఏర్పాటు చేస్తున్నారు. చిన్న ఐనంలో తాగునీటి ఎద్దడిపై 'సాక్షి'లో కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి వాగు వద్ద బోరుకు మోటర్ బిగించి సమస్యను పరిష్కరించారు. మిగిలిన గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు కొనసాగుతున్నాయి.

పట్టించుకోని అధికారులు..

నెల రోజులుగా గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామాల్లోని చేతిపంపుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ఎడ్లబండ్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనులు పూర్తయి మూడు రోజులు కావొస్తున్నా పైప్‌లైన్ పనులు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

64 గ్రామాలకు బంద్..

అందవెల్లి పెద్దవాగు వంతెన వద్ద భగీరథ పైప్‌లైన్ తొలగించడంతో వంతెన అవతలి వైపు 64 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అసలే వేసవి కావడంతో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. కాగజ్‌నగర్ మండలంతోపాటు కన్నెపల్లి, భీమిని, దహెగాం మండలాల్లో 64 గ్రామాలకు ఈ పైప్‌లైన్ ద్వారానే నీటి సరఫరా జరుగుతుంది. నెల రోజులుగా పైప్‌లైన్ కనెక్షన్ తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందవెల్లి పెద్దవాగు వంతెన వద్ద అప్రోచ్ పనులు మూడు రోజుల క్రితమే పూర్తి చేశారు. అయినా పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టడం లేదు.

మూడు రోజుల్లో పూర్తి చేస్తాం

అందవెల్లి పెద్దవాగు వద్ద వంతెన అప్రోచ్ పనులు ప్రారంభించడంతో భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ తొలగించాం. అప్రోచ్ పనులు పూర్తయిన నేపథ్యంలో మూడు రోజుల్లో పైప్‌పైన్ పనులు పూర్తి చేస్తాం. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. త్వరలో తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

– సాయికృష్ణ, భగీరథ ఏఈ

నేడే రంగుల పండుగ

రంగుల పండుగకు వేళయింది. జిల్లావ్యాప్తంగా గురువారం కామదహనం నిర్వహించగా, కొన్ని ప్రాంతాల్లో రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. శుక్రవారం హోలీ పండుగ జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. కౌటాల మండలం గురుడుపేట్ గ్రామంలో చిన్నారులు హోలీ పాటలు పాడుతూ ఇంటింటికీ తిరుగుతూ ధాన్యం, డబ్బులు సేకరించారు.

– కౌటాల



గురుడుపేట్‌లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

క్లుప్తంగా

ఒకరిపై అట్రాసిటి కేసు

లక్సెట్టిపేట(మంచిర్యాల): మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన బొప్పు సతీశ్‌పై అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పీ.సతీష్ తెలిపారు. ఈనెల 11న పట్టణానికి చెందిన మహిళ ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సారంగపూర్(నిర్మల్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాంశకు చెందిన బర్కుంట బాబు గురువారం గోపాల్‌పేట్‌లో ఉన్న అత్తగారింటికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గోపాల్‌పేట్ గ్రామ సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

బ్యాంకు మేనేజర్‌కు గాయాలు

కుంటాల: మండలంలోని అందాకూర్–కుంటాల గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ సచిన్‌కు గాయాలయ్యాయి. విధులు ముగించుకున్న మేనేజర్ భైంసాకు వెళ్తుండగా అడవిపందుల గుంపు కారుకు అడ్డురావడంతో అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో సచిన్‌కు గాయాలు కావడంతో 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో పోలీసులు

భీమిని: కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగంపల్లిలో గురువారం రేషన్‌బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దింటి వెంకటేశ్ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 3.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు ఆయన పేర్కొన్నారు. వెంకటేశ్‌ను విచారించగా సుర్జాపూర్‌కు చెందిన ఇందూరి లక్ష్మణ్ అనే వ్యక్తి ఇక్కడ ఉంచాడని సమాధానం ఇచ్చాడన్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని ఆర్‌కే1ఏ మార్కెట్ ఏరియాలో ఉన్న రేషన్ డీలర్ కిషన్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు తెలిపారు. షాపులో తనిఖీలు నిర్వహించగా ఉండాల్సిన నిల్వల కన్నా మూడున్నర క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండడంతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏసీఎస్‌వో వేణుగోపాల్, ఆర్‌ఐ పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని రేషన్ షాపులో బియ్యం నిల్వలు తక్కువ ఉండడంతో డీల ర్ రామగిరి రవిపై 6–ఏ కేసు నమోదైంది. సి విల్ సప్లయ్ డీటీ పోశన్న, సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ భూమేష్ ఆధ్వర్యంలో గురువారం తని ఖీలు నిర్వహించారు. వేమనపల్లిలోని రెండో రేషన్ షాపులో 9 క్వింటాళ్ల 92 కిలోల బియ్యం నిల్వలు తక్కువగా ఉండటంతోకేసు నమోదు చేశారు. మొదటి రేషన్ డీలర్ శ్యాంసుందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

బాడీ బిల్డర్స్ అడ్డా బెల్లంపల్లి

- పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులు
- ప్రాచీన క్రీడకు చేరువవుతున్న యువకులు



పతకాలతో బాడీ బిల్డర్లు అక్షయ్, లక్ష్మణ్, రేవంత్

బెల్లంపల్లి: బాడీ బిల్డింగ్ యువతలో క్రేజీని పెంచుతోంది. దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి నేటితరం యువకులు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు. రోజువారీగా జిమ్‌కు వెళ్లి శిక్షకుల పర్యవేక్షణలో దేహదారుఢ్యాన్ని పెంచుకునే మెలకువలు నేర్చుకుంటున్నారు. ఒకవైపు శిక్షణ తీసుకుంటూనే మరోవైపు బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు బెల్లంపల్లికి చెందిన క్రీడాకారులు. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొని ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తూ ప్రత్యేకతను చాటుతున్నారు. మెడల్స్ సాధించి బెల్లంపల్లికి వన్నె తెస్తున్నారు.

జిమ్‌లు వేదికగా...

బెల్లంపల్లి పురాతన కార్మిక క్షేత్రం. క్రీడాకారులకు నిలయమైన బెల్లంపల్లిలో బాడీ బిల్డర్లు మట్టిలో మాణిక్యాలుగా వెలుగొందుతున్నారు. ఎంతోమంది కార్మికులు సింగరేణిలో విధులు నిర్వహిస్తూనే బాడీ బిల్డింగ్‌పై మక్కువ పెంచుకున్నారు. కోలిండియా, సింగరేణిస్థాయి, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. స్థానికంగా ఉన్న జిమ్‌లను వేదికగా ఎంచుకుని ప్రత్యేక సాధన చేస్తున్నారు. సీనియర్ బాడీ బిల్డర్లు మురహరిరావు, బాలకృష్ణ, చంద్రోశేఖర్, మోబిన్, తదితరులు వారిని తీర్చిదిద్దడంతో కృతార్థులవుతున్నారు.

నస్పూర్‌లో జరిగిన పోటీల్లో...

మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఈనెల 9న ఆదివారం రాత్రి నస్పూర్ ఎలిఫెంట్ జిమ్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. ఇందులో బెల్లంపల్లి సైకిజిమ్ క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. 80 కిలోల విభాగంలో జి.లక్ష్మణ్ బంగారు, మాస్టర్ విభాగంలో పి.కృష్ణస్వామి బంగారు, 50 కిలోల విభాగంలో వెండి పతకం, 70 కిలోల విభాగంలో కె.అక్షయ్ బంగారు పతకం, జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారు. 55 కిలోల విభాగం, జూనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో కె.రేవంత్ ప్రథమస్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించాడు. మరో క్రీడాకారుడు జి.రవి 55 కిలోల విభాగంలో చతుర్థ స్థానంలో నిలిచాడు. ఎం.మహేష్, ఎం.రోహిత్, హుమాయున్ ఆయా విభాగాల పోటీల్లో పతకాలు గెలుచుకున్నారు.

గతేడాది మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్‌లో గతేడాది నవంబర్ నెలలో మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో బెల్లంపల్లి సైకిజిమ్ కోచ్ సదానందం 65 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. గతేడాది బెల్లంపల్లిలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో లక్ష్మణ్, కృష్ణ స్వామి బంగారు పతకాలు సాధించారు. ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న బాడీ బిల్డింగ్ పోటీల్లో బెల్లంపల్లి క్రీడాకారులు పతకాలు సాధిస్తూ అబ్బుర పరుస్తున్నారు. నేటితరం యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

చిన్నతనం నుంచే..



నాకు చిన్నతనం నుంచే బాడీబిల్డింగ్‌పై ఆసక్తి ఉంది. చదుకునే రోజుల్లో రోజువారీగా జిమ్‌కు వెళ్లి సాధన చేసేవాడిని. ఆ పట్టుదలతోనే కష్టపడి పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ పీఈటీగా ఎంపికయ్యా. ఇప్పటికీ పోటీల్లో పాల్గొంటున్నా.

– లక్ష్మణ్, బాడీబిల్డర్

ఆనందంగా ఉంది



సింగరేణిలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తూనే బాడీ బిల్డింగ్ సాధన చేస్తున్నా. ఏళ్ల తరబడి నుంచి నా దిన చర్యలో బాడీ బిల్డింగ్ సాధనకు ప్రాధాన్యం ఇస్తున్నా. ఇప్పటి వరకు పలు పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించా. బాడీ బిల్డర్‌గా రాణించడం ఆనందంగా ఉంది.

– కృష్ణస్వామి, బాడీబిల్డర్

ఏడాది నుంచి సాధన



బాడీబిల్డింగ్ అంటే నాకెంతో ఇష్టం. ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. ఏడాది నుంచి రోజువారీగా సాధన చేస్తున్నాను. ఆరోగ్యంగా ఉండటానికి బాడీ బిల్డింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సీనియర్స్ నుంచి ఎన్నో అంశాలు నేర్చుకుంటున్నా.

– రేవంత్, బాడీబిల్డర్

గూడేల్లో ‘పులారా’ ఉత్సవం



డోలు, సన్నాయిలతో కాముని దహనానికి వెళ్తున్న ఆదివాసీలు

- గిరిజన సంప్రదాయాలతో పూజలు
- ఘనంగా కాముని దహనం



మంట పైనుంచి దూకుతున్న యువకుడు

కెరమెరి(ఆసిఫాబాద్): ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో గురువారం సంప్రదాయబద్ధంగా పులారా ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతీ ఇంటి నుంచి కుడుకలను తీసుకువచ్చి గ్రామ పటేల్‌కు ఇచ్చారు. అంతకు ముందే అడవి నుంచి తీసుకువచ్చిన రెండు వెదురు బొంగులకు మాతారా, మాతరల్‌గా నామకరణం చేసి వాటికి కుడుకలు, గారెలు, వంకాయలు, ఉల్లిగడ్డలు, చక్కెర బిళ్లలు అమర్చారు. ఆయా గ్రామాల గ్రామ పటేళ్లు వాటికి పూజలు చేశారు. ఆ తర్వాత వాటికి మంటపెట్టారు. ఆచారం ప్రకారం కొందరు యువకులు వరుసగా అందులోంచి దూకారు. అనంతరం డోలు, సన్నాయిలతో కాముడి దహనం వరకు వెళ్లారు. గ్రామంలోని ప్రతీ కుటుంబం రొట్టెలు, పప్పులు తీసుకువచ్చి కాముని దహనం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సహపంక్తి భోజనం చేశారు. రాత్రంతా అక్కడే బస చేశారు. అక్కడున్న బూడిదను ఎవరూ దొంగిలించకుండా కాపాడారు. నేడు దురాడి (రంగులు చల్లుకోవడం)సంబరాలు జరుపుకోనున్నారు.

చైన్‌స్నాచర్ అరెస్టు

జైపూర్: వృద్ధులను టార్గెట్ చేసి గొలుసు చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 10న చెన్నూర్ పట్టణానికి చెందిన జంగ మణెమ్మ అవసరం నిమిత్తం పాతబస్టాండ్ వైపు వెళ్లగా సిద్దిపేటకు చెందిన అల్లెపు కృష్ణ ఆమెతో మాటలు కలిపి కొంతదూరం వెళ్లిన తర్వాత ఎవరూలేని ప్రాంతంలో ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై వెంకటేశ్వర్‌రావు చెన్నూర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పారిపోయేందుకు యత్నించిన కృష్ణను పట్టుకుని తనిఖీ చేయగా అతని వద్ద రెండు తులాల బంగారు గొలుసు లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. కాగా ఘటనకు 15 రోజుల క్రితమే బెజ్జంకి పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో జైలుకి వెళ్లివచ్చినట్లు తెలిపారు. సిద్దిపేటకు చెందిన కృష్ణపై పలు పోలీస్ స్టేషన్లలో వందకుపైగా కేసులు నమోదైనట్లు వారు పేర్కొన్నారు.

తల్లీకూతురు ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ తల్లి మృతి
- కూతురు పరిస్థితి విషమం



మృతి చెందిన పోశమ్మ

మంచిర్యాలక్రైం: మద్యం మత్తులో తల్లీకూతురు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ తల్లి మృతి చెందింది. కూతురు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలో చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని చున్నంబట్టివాడ వందఫీట్ల రోడ్‌లో నివాసం ఉంటున్న పస్తం పోశమ్మ (80) భర్త భీమయ్య పదేళ్ల క్రితమే చనిపోగా రాజమ్మ వివాహమైన కొద్దిరోజులకే భర్తను వదిలిపెట్టి తల్లితో కలిసి ఉంటోంది. ఇద్దరూ కలిసి ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త కాగితాలు ఏరుకుంటూ అవి విక్రయించగా వచ్చిన డబ్బులతో మద్యం సేవించి గొడవపడేవారు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన అనంతరం ఇద్దరూ గొడవపడ్డారు. మాటామాట పెరగడంతో క్షణికావేశంలో ఇద్దరూ పురుగుల మందు తాగారు. ఇద్దరి గొడవ వినిపించకపోవడంతో కొంతసేపటికి సమీపంలోనే ఉంటున్న పోశమ్మ మనవడు భీమేశ్ వెళ్లి చూడగా ఇద్దరూ అపస్మారక స్థితిలో పడిఉన్నారు. వెంటనే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పోశమ్మ గురువారం మృతి చెందింది. రాజమ్మ పరిస్థితి విషమంగా ఉంది. పోశమ్మ కుమారుడు గంగారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్ట్



వేటగాళ్లతో అటవీ అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి శివారులోని మామిడి తోటలో వన్యప్రాణుల మాంసం విక్రయిస్తున్న ముగ్గురు వేటగాళ్లను గురువారం అరెస్టు చేసినట్లు లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాశ్ తెలిపారు. టీకానపల్లికి చెందిన చాకేపల్లి సత్తయ్య, చాకేపల్లి వెంకటేశ్, ధర్మారం గ్రామానికి చెందిన రావుల లక్ష్మణ్ పాంగోలిన్(అలుగు) వేటాడి మాంసం విక్రయిస్తుండగా వారిని అరెస్ట్ చేసి అలుగు మాంసం, పొలుసును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వన్యప్రాణుల రక్షణ చట్టం 1972 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హాజీపూర్ డెప్యూటీ రేంజ్ అటవీ అధికారి సునీత, ఎఫ్‌బీవోలు ఫరీదాబాను, సుభాశ్ పాల్గొన్నారు.

ఐకే1ఏ గనిలో కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న కార్మికుడు

జైపూర్: ఇందారం ఐకే 1ఏ గనిలో గురువారం జరిగిన ప్రమాదంలో సపోర్టుమెన్ కార్మికుడు అంగల రాజయ్యకు గాయాలయ్యాయి. ఉదయం షిఫ్టు విధులకు వచ్చిన రాజయ్య గనిలో ఎస్–8 ప్యానెల్ 13డీప్ ఆఫ్ సెవెన్ లెవల్‌లో పని చేస్తుండగా హఠాత్తుగా సైడ్ ఫాల్ కావడంతో గాయాలయ్యాయి. తోటి కార్మికులు రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించారు. కార్మికుడిని ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్ నాయకులు పరామర్శించారు. పర్యవేక్షణ లోపం కారణంగానే ప్రమాదం జరిగిందని, అందుకు కారకులపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ కేంద్రక మిటీ నాయకులు తిప్పరపు సారయ్య డిమాండ్ చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

చింతలమానెపల్లి: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి చెందినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. మండలంలోని లంబాడిహేటి గ్రామానికి చెందిన అజ్మీర శాంతాబాయి (53) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈక్రమంలో అప్పులు కావడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 11న మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు అజ్మీర ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొజుర్ రంజిత్ (35) మావల మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో కూలర్ స్విచ్ వేయడంతో షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య జోశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

విద్యార్థులకు రవాణా భత్యం

- ఒక్కొక్కరికి నెలకు రూ.600 చెల్లింపు
- నాలుగేళ్ల తర్వాత నిధులు మంజూరు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దూర ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం రవాణా భత్యం విడుదల చేసింది. 2024–25కు సంబంధించిన నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు 10 నెలలపాటు నెలకు రూ.600 చొప్పున అందించాలని నిర్ణయించింది. నాలుగేళ్ల తర్వాత రవాణా చార్జీలు చెల్లిస్తుండడంతో విద్యార్థుల ఇక్కట్లు తొలగిపోనున్నాయి. గతంలో రవాణా చార్జీల చెల్లింపుల నిలిపివేతతో చాలామంది ఇబ్బంది పడ్డారు.

సమీపంలో లేకపోవడంతోనే..

సమీపంలో పాఠశాల లేక, ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటరు,ప్రాథమికోన్నత పాఠశాలలకు మూడు కిలోమీటర్ల వరకు, ఉన్నత పాఠశాలలకు ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లే విద్యార్థులు ప్రయాణ భత్యాన్ని పొందేందుకు అర్హులు. ఒక విద్యార్థికి ఏడాదికి రూ.6వేల చొప్పున చెల్లిస్తారు. విద్యార్థి హాజరు 80 శాతం ఉండాలి. రూ.6వేలు రానుండడంతో తల్లి దండ్రులపై భారం తగ్గనుంది.

ఉమ్మడి జిల్లా విద్యార్థుల వివరాలు

జిల్లా	స్కూళ్లులేని ప్రాంతాలు	విద్యార్థులు	నిధులు (రూ.లలో)
ఆదిలాబాద్	154	1061	63,66,000
కుమురంభీం	163	852	51,12,000
మంచిర్యాల	89	496	29,76,000
నిర్మల్	95	921	55,26,000

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో స్కూల్ లెస్ హ్యాబిటేషన్స్ (పాఠశాల తక్కువ ఆవాసాలు), విద్యార్థుల వివరాలను గుర్తించారు. దూరప్రాంతాలకు వెళ్లి రవాణా భత్యం పొందే వారి లెక్కతేల్చారు. ఆదిలాబాద్‌లో ప్రాథమిక స్కూళ్ల విద్యార్థులు 271 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 522 మంది, హైస్కూళ్లలో 268 మందిని అర్హులుగా గుర్తించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో 45, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 508, ఉన్నత పాఠశాలల్లో 299 మంది, మంచిర్యాల జిల్లాలో పీఎస్‌లో 83, యూపీఎస్‌లో 269, హైస్కూళ్లలో 114 మంది విద్యార్థులను గుర్తించారు. నిర్మల్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో 46, యూపీఎస్‌లో 569, ఉన్నత పాఠశాలలో 306 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించారు.

మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

బెజ్జూర్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కావుడే లస్మయ్య (52) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య కమలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

వృద్ధుడు బలవన్మరణం



సాంబయ్య (ఫైల్)

తాండూర్: మనస్తాపంతో పురుగుల మందు తాగి వృద్ధుడు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గోపాల్ నగర్‌కు చెందిన రావుల సాంబయ్య (60) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈక్రమంలో నిత్యం మద్యం సేవించి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. గురువారం మద్యం సేవించి భార్య కౌసల్యతో గొడవ పడడంతో ఆమె మందలించింది. దీంతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జగిత్యాల ఇన్‌చార్జిగా ప్రదీప్



రత్నం ప్రదీప్

కాసిపేట: కాసిపేట మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రత్నం ప్రదీప్‌ను జగిత్యాల జిల్లా ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను జిల్లాల ఇన్‌చార్జీలుగా నియమిస్తూ ఈనెల 12న ఉత్తర్వులు వెలువడ్డాయి.

గంజాయి కేసులో ఆరుగురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

భీమారం(చెన్నూర్): మంచిర్యాల జిల్లా భీమారంలో గంజాయి కేసులో ఆరుగురు యువకులను అరెస్టు చేసినట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. గురువారం జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల–చెన్నూరు జాతీయరహదారిలో భీమారం ప్రభుత్వ కలప డిపో వద్ద దుర్గం సందీప్, దుర్గం సంజయ్, వనపర్తి కరుణాసాగర్, రావుల ఆదర్శ్ అనుమానాస్పదంగా కనిపించడంతో ఎస్సై శ్వేత వారిని తనిఖీ చేయగా కిలోన్నర గంజాయి లభించింది. చెడు వ్యసనాలకు అలవాటుపడిన కాసిపేటకు చెందిన సందీప్, అంకుసాపూర్‌కు చెందిన సంజయ్ మహారాష్ట్రలోని చంద్రాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులవద్ద గంజాయి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈనెల 11న ఇద్దరూ కలిసి చంద్రాపూర్‌లో కిలోన్నర గంజాయి కొనుగోలు చేసి గురువారం భీమారంలో కిష్టంపేటకు చెందిన వనపర్తి కరుణాసాగర్, రావుల ఆదర్శ్‌కు విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ నలుగురితో పాటు భీమారంకు చెందిన రాంటెంకి స్వస్తిక్‌కుమార్, జువేరి శ్రీనివాస్‌ను బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్వేత పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గురువారం సాయంత్రం గంజాయి విక్రయిస్తున్న మహిళతో పాటు మరో యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ భీమేష్, ఎస్సై మహేందర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన తిడికే రంజనాతో పాటు వినాయక్ గంజాయి పొట్లాలు అమ్ముతుండగా తమకు అందిన సమాచారం మేరకు పట్టుకుని వారి వద్ద నుంచి 450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతీ, యువకుడిపై దాడి



సంఘటన స్థలంలో పోలీసులు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం–టేకుమట్ల క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి 7.20గంటల ప్రాంతంలో ఓ యువతీ, యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి దారి దోపిడీకి పాల్పడ్డారు. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా రెబ్బెనకు చెందిన ఆరికెళ్ల సుమన్ పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో చికిత్స పొందుతున్న తన బంధువులను చూడడానికి వెళ్లాడు. సాయంత్రం 7గంటల ప్రాంతంలో సుమన్ తన బంధువైన యువతి(25)తో కలిసి సీసీసీ నస్పూర్ వైపు వెళ్తున్న క్రమంలో టేకుమట్ల క్రాస్ రోడ్డు వద్ద ఆగారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వారి వద్దకు వచ్చి దాడి చేశారు. ఇద్దరిని కొట్టుకుంటూ చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి వారి వద్ద ఉన్న రూ.4వేలు నగదు, సెల్‌ఫోన్ లాక్కొని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీధర్ వివరించారు. గురువారం సంఘటన స్థలాన్ని మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పరిశీలించారు. కాగా, రాత్రి సమయంలో ముగ్గురు వ్యక్తులు యువకుడిపై దాడి చేసి యువతిపై అఘాయిత్యానికి పాల్పడ్డారనే ప్రచారం జరిగింది. రోజంతా విచారణ జరిపిన పోలీసులు యువతీ, యువకులపై దాడి జరిగినట్లు పేర్కొన్నారు.

కాలేజ్‌రోడ్‌లో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. టీజీబీలో క్యాషియర్‌గా పనిచేస్తున్న బాలేశ్వర్ ఈ నెల 12న కుటుంబ సభ్యులతో కలిసి ఆసిఫాబాద్ వెళ్లాడు. గురువారం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి పరిశీలించగా 5తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

WANTED TEACHERS
OPEN POSITIONS
PRE-PRIMARY & PRIMARY MOTHER TEACHERS - LKG(2), UKG(2), 1ST(2), 2ND(1)
PRIMARY & HIGH SCHOOL SUBJECT TEACHERS - MATHS, SCIENCE, PHYSICS, BIOLOGY, SOCIAL
NOTE
Any Bachelor's degree(B.Ed preferred)
Experience is required
We also encourage passionate freshers
WALK-IN INTERVIEWS 10th to 17th March 3:00 to 5:00 pm
SREE RAINBOW SCHOOL NURSERY TO VIII
CCC, NASPUR, MANCHERIAL. Cell: 9059212331, 7661816775

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002107]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA25002140]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,